క్లుప్తంగా

పాంచాళవరంలో 'పొలం పిలుస్తోంది'



అమర్తలూరు(వేమూరు): వర్షాల వల్ల వరి పైరుకు పాము పొడ, అగ్గి తెగులు వ్యాప్తించడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని పాంచాళవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో పాము పొడ, అగ్గి తెగుళ్ల నివారణకు హెక్సాకోనజోల్, ట్రై సైక్లోజోల్ మందులు పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేమూరు: వరిపైరులో అధికమొత్తంలో ఎరువులు, పురుగు మందులు వాడరాదని మండల వ్యవసాయాధికారి చందోలు సునీత అన్నారు. వేమూరు మండలంలోని అబ్బనగూడవి, వరహాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని ఆమె రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి



బాపట్లటౌన్: బాణసంచా దుకాణదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథరెడ్డి తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు బాణసంచా దుకాణాల నిర్వహణకు బుధవారం సాయంత్రం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ ఆట స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రాంగణంలో దీపావళి బాణాసంచా విక్రయించేందుకు తాత్కాలిక దుకాణాలను ఏర్పాటుచేయనున్నామన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి లాటరీ పద్ధతిలో షాపులను కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు విశేష పూజలు



పెదగొల్లపాలెం(కర్లపాలెం): దేవీ శరన్నవరాత్రులలో భాగంగా పెదగొల్లపాలెం గ్రామంలో పూజలందుకున్న కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహం వద్ద బుధవారం జరిగిన పూజల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి, స్థానిక సర్పంచ్ యల్లావుల సురేష్ రాదవ్‌తో కలసి పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మధుసూదనరెడ్డి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు దేగల రవి రెడ్డి, కుంచాల వీరరాఘవరెడ్డి, గోవతోటి విజయ్, అజీమ్‌ఖాన్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ అండ్ డీఎల్‌టీసీఎస్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెనాలి చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం ఎన్నికలను నిర్వహించారు. కార్యదర్శిగా అమర్తలూరి యోబు, కోశాధికారిగా షేక్ మాలింబీ, ఉపాధ్యక్షులుగా దుర్గపు శేఖర్‌బాబు, ఎంహెచ్‌ఆర్ బాలాజీ, సంయుక్త కార్యదర్శులుగా గద్దె వెంకటేశ్వర రావు, మూకిరి విజయప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా కేపీఎం ప్రకాష్ బాబు, కోలుకొండ శివ అప్పారావు, బొడ్డు శ్రీనివాసరావు, డి.పద్మజలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ఎల్.భీమారావు, బి.రమేష్ బాబులు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు డి.శ్రీనివాస్, పలువురు ఐటీఐ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

కొల్లిపర: సీజనల్ వ్యాధుల పట్ల గ్రామంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మిసుధ అన్నారు.బుధవారం ఆమె మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తుఫాను నేపథ్యంలో మండల వ్యాప్తంగా విస్తరంగా వర్షాలు కురువడంతో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు చేరి రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. వేడి చేసిన గోరు వెచ్చని నీటిని తాగాలన్నారు. ఈ సీజన్‌లో జ్వరం, మలేరియా, డెంగీ , కలరా వ్యాధులు వచ్చే అవకాశాలు ఉందని , అనారోగ్యం అనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకోవాలని సూచించారు.

సిరులు కురిపిస్తున్న వేరుశనగ

- ఏడాదిలో రెండు, మూడుసార్లు సాగు
- ఇతర జిల్లాలకు సైతం ఎగుమతులు
- మహానేత డాక్టర్ వైఎస్సార్ పుణ్యమే అంటున్న జిల్లా రైతులు



వేరుశనగను ఆరబెట్టిన దృశ్యం

బాపట్ల: ఒకప్పుడు ఏటు చూసినా ముళ్లపొదలు... దట్టమైన చిల్లచెట్లతో అటవీశాఖ భూములను తలపించేవిధంగా ఉండే భూములు నేడు వేరుశనగ సాగుకు కేరాఫ్ మారాయి. జిల్లాలోని బాపట్ల, చీరాల, వేటపాలెం, చిన్నగంజాం, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల పరిధిలో వేరుశనగ సేద్యం ముమ్మరంగా సాగుతుంది. జిల్లాలో కోస్తా తీర ప్రాంతంలో 15వేల ఎకరాలకుపైగా ఈ పంటను సాగు చేస్తున్నారు. ఒకప్పుడు బాపట్ల నియోజకవర్గంలోని కర్లపాలెం మండలానికి వెళ్ళే దారిలో ఏటు చూసినా ఖాళీపొలాలు, అక్కడక్కడ ఆకుకూరలు, కూరగాయల సాగుచేసే పొలాలు కనపడేవి. ప్రస్తుతం పుడమితల్లి పచ్చదనం అద్దినట్లుగా ఏడాది పొడవునా ఎప్పుడుచూసినా పచ్చని వేరుశనగ పైర్లతో కళకళలాడుతున్న పంటపొలాలు మండలానికి చేరుకునే ప్రజలకు స్వాగతం పలుకుతున్నాయి. అదేవిధంగా బాపట్ల మండలంలోని మరుప్రోలువారిపాలెం, పిన్నిబోయినవారిపాలెం, పాండురంగాపురం, అడవిపల్లిపాలెం, దరివాదకొత్త పాలెం గ్రామంలో కూడా రైతులు వేరుశనగ సాగుకు శ్రీకారం చుట్టి మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

ఉచిత విద్యుత్‌తో పొలాలకు మహర్దశ

గతంలో నీటిసౌకర్యం లేక అటవీశాఖ భూములను తలపించేలా ఉండే పంటపొలాలు దివంగత మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలిసంతకం పెట్టిన ఉచిత విద్యుత్ పథకం పుణ్యమాని నేడు సస్యశ్యామలంగా మారాయి. ఈ పథకం కింద మండలంలోని దుండివారిపాలెం, బోలాయపాలెం, తిమ్మారెడ్డిపాలెం, ఏట్రవారిపాలెం, దమ్మనవారిపాలెం, శ్రీరాంనగర్, ఎం.వి.రాజుపాలెం, కొత్తనందాయపాలెం, నల్లమోతువారిపాలెం, పాతనందాయపాలెం గ్రామాల్లో సుమారు 600 మంది రైతులు ఆయా పొలాలకు సుదూర ప్రాంతం నుంచి విద్యుత్ లైన్లు సౌకర్యం ఏర్పాటు చేసుకొని పొలాల్లో బోర్లు దింపి వాటి సహాయంతో మొదట్లో 700 ఎకరాలతో వేరుశనగ పైరుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం జిల్లాలో 15వేల ఎకరాల స్థాయికి చేరింది. ఆయా గ్రామాల్లోని ఏ ఒక్కరైతును పలుకరించినా మహానేత పెట్టిన ఉచిత విద్యుత్ పథకమే తమ బతుకుల్లో వెలుగులు నింపిందంటూ ముక్తకంఠంతో చెబుతారు.

5వేల కుటుంబాలకు నిత్యం ఉపాధి..

ఒకప్పుడు మండలంలోని కూలీలు ఖరీఫ్ సీజన్‌లో ఉండే వ్యవసాయ పనులు మినహా ఏడాదంతా ఖాళీగా ఉండేవాళ్ళు. ప్రస్తుతం వేరుశనగ సాగు ఏడాది పొడవునా సాగుచేయటం వలన ఆయా గ్రామాల్లోని సుమారు 5వేల మందికి ఏడాది పొడవునా వేరుశనగ పొలంలో తొక్కురొల్లడం, కలుపుతీయటం, కాయలు కోయటం, కల్లాలను శుభ్రంచేయటం, కాయలు నుంచి పప్పును వేరుచేయటం లాంటి పనులు నిత్యం ఉంటున్నాయి. దీంతో ఉపాధికోసం వలసలు వెళ్లే అవసరం లేకుండా గ్రామంలోనే ఉపాధి దొరుకుతుందని కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇతర జిల్లాలకు సైతం ఎగుమతి

రాష్ట్రంలోనే వేరుశనగకు అనంతపురం జిల్లా పేరుగాంచగా ప్రస్తుతం బాపట్ల జిల్లా కూడా కేరాఫ్‌గా మారింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు కృష్ణా, ప్రకాశం జిల్లాలకు వేరుశనగను బాపట్ల, చీరాల, కర్లపాలెం, వేటపాలెం నుంచే ఎగుమతి చేస్తున్నారు. వేరుశనగ ప్రస్తుతం ఎకరాకు 30 నుంచి 35 బస్తాల మేరా దిగుబడి వస్తుంది. వేరుశనగ కాయలతోపాటు ఉడికించిన కాయలు, వేరుశనగ పచ్చిపప్పు, వేయించిన పప్పు, వాటి నుంచి తీసిన నూనె, వేరుశనగ తయారుచేసి తినుబండారాలను కూడా ఇక్కడి నుంచి వేరే ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.



వేరుశనగ పొలంలో పనిచేస్తున్న రైతులు, కూలీలు

మహానేత పుణ్యమే..



మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఉచిత విద్యుత్ ఇవ్వటం వల్లే బోర్లు ద్వారా ఈ ప్రాంతంలో వేరుశనగ సాగు చేయటం ప్రారంభమయింది. గతంలో ఈ పొలాలన్నీ బీడుగా ఉండేవి. ప్రస్తుతం ఎటు చూసినా వేరుశనగ పైరుతో పచ్చగా కనిపిస్తున్నాయంటే మహానేత పుణ్యమే.. – **వెంకటేశ్వరరెడ్డి**, కావూరివారిపాలెం

ఎంతో లాభదాయకంగా ఉంది



వేరుశనగ ఏడాదికి రెండు, మూడు పంటలు వేయటం వలన ఎంతో లాభాదాయకంగా ఉంది. ఖాళీగా ఉండకుండా రైతులకు పైరు లాభాలు తెచ్చిపెడుతుంది. మార్కెట్‌లో కూడా ధర బాగానే ఉంది. –శ్రీనివాసరావు, వెదుళ్లపల్లి

జెడ్పీటీసీ మాజీ సభ్యుడికి మేరుగ నాగార్జున పరామర్శ

చుండూరు(వేమూరు): చుండూరు మండలం వలివేరు గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గాదె శివరామ కృష్ణారెడ్డిని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య సేవలు పొంది వలివేరు వచ్చిన శివరామ కృష్ణారెడ్డిని బుధవారం మేరుగ నాగార్జున పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. కొద్దిరోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆయనవెంట చందోలు డేవిడ్ విజయకుమార్, బొల్లిముంత ఏడుకొండలు తదితరులు ఉన్నారు.



గాదె శివరామ కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున

వైభవంగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట

దుండివారిపాలెం(కర్లపాలెం): కర్లపాలెం మండలంలోని దుండివారిపాలెం గ్రామంలో బుధవారం త్రయాహ్నిక దీక్షతో శ్రీ అభయ ఆంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో స్థానిక గ్రామ సచివాలయం భవనం సమీపంలో ప్రత్యేకంగా నిర్మించిన వేదికపై స్వర్ణ వెంకట శ్రీనివాసశర్మ బృందంచే నిర్వహించిన శాంతిహోమాల అనంతరం అభయ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా గత మూడు రోజుల నుంచి ప్రత్యేక హోమాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు, మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కోన రఘుపతి పాల్గొని పూజలు చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ పులుగు గోవిందమ్మ మునిరెడ్డి దంపతులు, వైఎస్సార్ సీపీ నాయకులు పులుగు శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో నరేంద్ర వర్మ, రఘుపతి పాల్గొన్నారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని, పూజలు చేసి ప్రసాదాలను స్వీకరించారు.



దుండివారిపాలెంలో ప్రతిష్ఠించిన అభయాంజనేయ స్వామి విగ్రహం

ఫెన్సింగ్ పోటీల్లో సీజే పాలెం విద్యార్థుల ప్రతిభ

బాపట్లటౌన్: విద్యార్థి దశనుంచే చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని చెరువు జమ్ములపాలెం పాఠశాల హెచ్‌ఎం వి.వి.కృష్ణారావు తెలిపారు. మండలంలోని సీజేపాలెం పాఠశాలకు చెందిన ఎ.మణికంఠ (10వతరగతి), కె.విజయ్ (10వ తరగతి), సిహెచ్ శివమణికంఠ (9వ తరగతి)లు ఇటీవల గుంటూరు బీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని జిల్లాస్థాయి విజేతలుగా నిలిచారు. అండర్–17 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 19 నుంచి 21వరకు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాలలో అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బోయిన వీరచంద్ర, గ్రామ సర్పంచ్ బోయిన వెంకటేశ్వరమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్ బోయిన నాగరాజు పాల్గొన్నారు.



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడండి

- సచివాలయం నిర్మాణం టీడీపీ హయాంలోనే జరిగింది
- మా హయాంలో అంటూ అవాస్తవ ప్రచారం
- పచ్చపత్రిక అసత్య కథనంపై వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు

తెనాలి: పట్టణ చినరావూరులోని 13వ వార్డు సచివాలయం పైఅంతస్తులోని వార్డు సచివాలయం సీలింగ్ కుప్పకూలటంపై నిజానిజాలు తెలుసుకోకుండా పచ్చపత్రికలో వక్రీకరించి అసత్యాలను రాశారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో రూ.49 లక్షలతో నిర్మించిన భవనం నాసిరకం పనుల కారణంగానే సీలింగ్ కుప్పకూలిందని రాయటం పూర్తిగా వాస్తవ విరుద్ధమన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి అక్కిదాసు కిరణ్‌కుమార్, పార్టీ బీసీ సంఘ నేత పెదలంక వెంకటేశ్వరరావు, షేక్ ఖాజా, షేక్ జాకీర్ మాట్లాడారు. 13వ వార్డులో గతంలోనే నిర్మించిన కమ్యూనిటీ హాలుపై మొదటి అంతస్తును టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. 2017లో మున్సిపల్ నిధులు రూ.49 లక్షలతో నిర్మాణం ఆరంభించి 2019 జనవరి నాటికి పూర్తిచేశారని తెలిపారు. టీడీపీ హయాంలోనే అంటే 2019 జనవరి 5వ తేదీన పైఅంతస్తును ప్రారంభించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ ఆరంభించాక, 13వ వార్డు సచివాలయం ఏర్పాటు చేసిన ప్రభుత్వ భవనం పెచ్చులూడుతూ, వర్షపునీరు లీకేజితో ప్రస్తుత కమ్యూనిటీ హాలు పైఅంతస్తులోకి మార్చినట్టు తెలిపారు. టీడీపీ హయాంలో నిర్మాణమైన పైఅంతస్తులో సంబంధిత కాంట్రాక్టరు నాసిరకం మెటీరియల్‌ను వాడిన కారణగానే సీలింగ్ కుప్పకూలిందని ఆరోపించారు. వాస్తవాలిలావుంటే అసలు భవనం వైసీపీ హయాంలోనే జరిగిందని, నాసిరకం పనులు చేశారంటూ తమ పార్టీపై బురద జల్లాలని చూడటం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో వీరిఓ కసుకుర్తి నాగమల్లేశ్వరరావు, వంపుగళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్

చెరుకుపల్లి: వర్షాల కారణంగా గ్రామాల్లో అధికారులు ఎప్పటికప్పుడు నీటి నిల్వలను తొలగించి పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అధికారులు ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు. విద్యుత్‌శాఖ ఏఈ పెరుగు శ్రీనివాసరావు మాట్లాడారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి సుమలత, ఎంపీడీఓ షేక్ మహబుబ్ సుభాని, డిప్యూటీ తహసీల్దార్ ఎ.శాంతలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్

వర్షం.. అస్తవ్యస్తం

భట్టిప్రోలు: అల్పపీడన ప్రభావంతో భట్టిప్రోలు మండలంలో గత మూడు రోజులుగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉన్నాయి. రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఊడ్చుకుపోయిన పంట పొలాలు మినహా మిగిలిన పంట పొలాలన్నీ పచ్చగా కళకళలాడుతున్నాయి. వెల్లటూరు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో వర్షపు నీరు చుట్టుముట్టింది. అలాగే రహదారులన్నీ చిత్తడిగా మారాయి. భట్టిప్రోలులోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో నివసిస్తున్న ప్రజల బాధలు వర్ణనాతీతం. దీనికి తోడు కాల్వకట్ట రహదారి అధ్వానంగా మారింది. మండలంలోని ఐలవరం, అద్దేపల్లి, భట్టిప్రోలు ప్రాంతాలలోని చేనేత వాడల్లో మగ్గాలు ముందుకు కదలడం లేదు.

ముంపు ముప్పులో పంటలు

కొల్లూరు: అల్పపీడనం ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల దాటికి పంట పొలాలు జలాశయాలను తలపిస్తున్నాయి. వరదలు అనంతరం తిరిగి సాగు సమరంకు సన్నద్ధమైన అన్నదాతలు ప్రత్యామ్నాయ పంటగా మినుము సాగుకు మొగ్గు చూపారు. అయితే ఏకధాటిగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో మినప పంటకు తీవ్ర నష్టం వాటిల్లనుంది. మినప పంటలో ఓపక్క పురుగు బెడద అధికమైన సమయంలో విరామం లేకుండా పడుతున్న వానలవల్ల పురుగుల నిర్మూలనకు పురుగుమందులు పిచికారీ చేసుకునే వెసులుబాటు సైతం లేక రైతులు మినుము పంటపై సైతం ఆశలు వదులుకుంటున్నారు. మండలంలోని లంక గ్రామాలలో సాగులో ఉన్న మినుము పంటపై వర్షం ప్రభావం అధికంగా ఉండటంతో మినప రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనున్నట్లు రైతులు అభిప్రాయపడుతున్నారు. వరదలను తట్టుకొని అరకొరగా మిగిలిన వాణిజ్య పంటలైన పసుపు, మొక్కదశలో ఉన్న అరటి ఇతర కూరగాయల పంటలు సైతం వర్షాల దాటికి దెబ్బతిని ఎందుకూ పనికిరాకుండా పోతాయన్న భావన రైతుల్లో వ్యక్తమవుతుంది.



భట్టిప్రోలులో జోరున కురుస్తున్న వర్షం



భట్టిప్రోలు మండలం వెల్లటూరు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు



జువ్వలపాలెం సబ్‌స్టేషన్ సమీపంలో మినుము పైరులో చేరిన వర్షపు నీరు

అభ్యసన వైకల్యంపై అవగాహన



కొల్లిపర: స్థానిక భవిత కేంద్రం ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్) లో బుధవారం డిస్లెక్సియా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ సాల్మ న్‌రాజ్ మాట్లాడుతూ నిర్దిష్ట అభ్యసన వైకల్యాల పిల్లల్లో పురోగతి తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఇందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం కొల్లిపరలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో2 ఝాన్సీలత, ప్రధానోపాధ్యాయులు పి.మృత్యుంజయరావ్, కరీమూన్ నూర్జహాన్, సురేష్, పాపయ్య, సీఆర్‌పి రమేష్‌బాబు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి భూమిపూజ

ఐలవరం(భట్టిప్రోలు): పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలలో భాగంగా బుధవారం భట్టిప్రోలు మండలం ఆళ్లమూడి, పల్లెకోన, సూరేపల్లి, గ్రామ పంచాయతీల పరిధిలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, గ్రామ సర్పంచులు పెద్దిశెట్టి రాంబాబు, బొల్లెద్దు రాజమ్మ, ఎంపీడీఓ ఎస్‌వీ రమణ, ఈవోపీఆర్డీ టి. ఊహారాణి, ఏపీఓ శివపార్వతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పెనుమూడి, కామరాజుగడ్డ నార్త్ గ్రామాలలో రహదారి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శోభారాణి భూమిపూజ చేసి రహదారి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు దారం విజయ్, ఉయ్యూరు లక్ష్మీపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

బాపట్ల: ఆహార పదార్థాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ జనరల్ మేనేజర్ పి.ఎస్.వి.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా స్థానిక డాక్టర్ ఎన్జీ ఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ మేనేజర్ పి.ఎస్.వి.కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. ఆహార పదార్థాలపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని తెలిపారు. పోషకాహారం తీసుకోవటం వలన రోగ నిరోధకశక్తి పెంపొందుతుందని తెలిపారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్, రిటైర్డు డీన్ డాక్టర్ జాగర్లమూడి లక్ష్మీ, వ్యవసాయ కళాశాల డీన్ ప్రసూనరాణి, డాక్టర్ డీడీ స్మిత్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కర్లపాలెం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11గంటలకు ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొంటారని ఎంపీడీఓ తెలిపారు.

ఎంఎల్‌సీ ఓటుకు దరఖాస్తు చేయించుకోండి

తెనాలిఅర్బన్: జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చదివిన వారు అర్హులని చెప్పారు. డిగ్రీ సర్టిఫికెట్, అధార్ కార్డు, ఓటర్ కార్డు జిరాక్సులతో పాటు పాస్‌పోర్టు ఫోటోలతో నవంబర్ 11వ తేదీలోపు మున్సిపల్ కార్యాలయంకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

13వ వార్డు సచివాయంలో ట్యాబ్ అపహరణ

కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన సచివాలయ ఉద్యోగులు

తెనాలిఅర్బన్: స్థానిక 13వ వార్డులోని వార్డు సచివాలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. మున్సిపల్ అధికారుల కథనం ప్రకారం చినరావూరు కమ్యునిటీ హాల్ పై అంతస్తులో 13వ వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. దానిలోని సీలింగ్ సోమవారం రాత్రి కూలి పెద్ద ప్రమాదం తప్పిన విషయం తెలిసిందే. దానిలో మంగళవారం విధులు నిర్వహించిన ఉద్యోగులు రాత్రి సమయంలో తాళం వేసి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం వచ్చి చూడగా గ్లాస్ డోర్ తెరచి ఉంది. దీంతో ఉద్యోగులు దానిని పరిశీలించగా లోపలున్న అరమరకు సంబంధించిన ర్యాక్‌లు తెరచి వస్తువులు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. అంతేకాకుండా ట్యాబ్ ఒకటి కన్పించలేదు. దీంతో వారు మున్సిపల్ కార్యాలయంకు వచ్చి కమిషనర్ బండి శేషన్నకు దీనిపై ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన కౌన్సిలర్ కుర్రా సుజాతతో కలిసి సచివాలయంను పరిశీలించారు. దీనిపై విచారణ జరుగుతుందని ఆయన తెలిపారు. ఇంకా ఏమైన వస్తువులు చోరీకి గురయ్యాయనే దానిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఉండే కరణం అమర్‌చంద్, జనార్ధనరావు హోటల్‌లో కార్మికులుగా పని చేస్తుంటారు. ఇటీవల మద్యం మత్తులో ఇద్దరు ఘర్షణపడగా జనార్ధనరావు అమర్‌చంద్‌ను నెట్టడంతో కిందపడి తలకు తీవ్ర గాయమైంది. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ 6వ తేదీన మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారంతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన అనంతరం నిందితుడు పరారయ్యాడు. హోటల్ నిర్వాహకుల వద్ద నిందితుడి వివరాలు లేకపోవడంతో విచారణ ఆలస్యమైందని సీఐ రమేష్‌బాబు తెలిపారు.